.... రక్షించు!' అని అక్కడే బోర్లాపడి ప్రార్థించావా?"

"లేదు. భగవంతుడు రక్షించలేడని నాకు తెలుసు. శోభ నా జీవితంలో ఇంకా దగ్గరగా రానందుకు చాలా సంతోషించాను. మా ఇద్దరికీ గొప్ప మేలు జరిగిందని తుళ్ళుతూ వొచ్చాను."

"పోనీ నువ్వు అయితే ఆమెకి చాలా స్వాతంత్రం ఇస్తావుగా?"

"స్వతంత్రం వొకరి కింకొకరు ఇచ్చేది కాదోయ్! కాళ్ళూ చేతులూ ఎంత స్వంతమో అదీ అంత స్వంతం. జన్మహక్కు! పక్షిని పంజరంలో పెడితే గింజుకుంటుందే — శక్తికొద్దీ పోరాడుతుందే! స్వతంత్రంగా గాలి పీలుస్తూ స్వతంత్రంగా వ్యవహరించాలనే తపన లేని మనుషులు కూడా మనుషులేనా? భర్త రాగానే ఆమె తన స్నేహితుల్ని పంపించేసి అతని సమక్షంలో హాజరై పోవాలా? శోభకి అంతరాత్మ వుందట. కానీ అది భర్తకి అణకువగా ముడుచుకుని, పెంపుడు కుక్కలాగా, ఎదురు తిరగకుండా, ఘర్షణ పడకుండా, సమస్యలు లేపకుండా, కార్ల కోసమో హోదాల కోసమో నగల కోసమో ఆఖరికి ఓ చీర కోసమో వినయంగా పడి వుంటుంది! అబ్బ! ఈ ఆడ వాళ్ళు .... పైపై అందాలు పెంచుకునే పాట్లు పడతారుగానీ .... లోపల ఎంత మురికి జీవితాల్లో అయినా ఇమిడిపోతారు! వాళ్ళని భరించటానికి అంత మురికి మొగాళ్ళే సరిపోతారు. నేను మాత్రం .... ఎప్పుడో .... హఠాత్తుగా ... ఎక్కడో ... నిర్మలంగా ... ఉజ్వలంగా... వెలిగే ఒక చిన్న హృదయం దొరకదా అని నిరీక్షిస్తున్నాను .... ఇంకెంత చెప్పమంటావు? అదీ శోభ కథ!"

"ఏడిసినట్టుంది నీ స్టోరీ! పెళ్ళాం వినయంగా పడివుంటానంటే మొత్తుకునే వెధవని నిన్నే చూశాను. అబ్బే! ఏమిటో అనుకున్నానుగానీ ఈ జన్మలో నీకింకేం పెళ్ళవుతుందీ? వొచ్చే జన్మలో నేనే చేసుకుంటాలే, ఊరుకో!"

"వద్దు నాయనా! నాకీ జన్మంతా నిద్రపట్టదు. బెల్లంపాకం వుడికే మూకుళ్ళెప్పుడన్నా చూశావా?"

"ఎందుకూ?"

"నిన్నూ ఆడవాళ్ళనీ అందులో పారేసి, ఓ బస్తా సోడా పోసి .... ఉడికించి .... బాది .... ఆరేసి .... ఎండబెట్టి .... మడతబెట్టి .... ఇస్త్రీ చేసి ...."

"చాల్లేవోయ్! తెగ పేల్తున్నావు, ఏ పిల్ల చేతిలోనో లెంపకాయలు తింటావు!"

"కృతజ్ఞుణ్ణి స్నేహితుడా!"

[1971 మే "వసుధ" మాసపత్రికలో] ★

# కనిపించుట లేదు!

నా భార్య, ముగ్గుల మహలక్ష్మి మొన్న సంక్రాంతి పండుగ తర్వాత 'ముక్కనుము' నాడు హైదరాబాదు నుంచి రథం ముగ్గు వేసుకుంటూ బయల్దేరింది. ఇంతవరకూ ఇంటికి రాలేదు. బహుశా ఇప్పటికి బెజవాడ ప్రాంతాల్లో ఎవరి ఇంటి ముందు నుంచో రథం ముగ్గు లాగుతూ వుండవచ్చును.

ఈ సంక్రాంతి నెలంతా రాత్రింబగళ్ళూ ముగ్గులు పెడుతూ వుండటంచేత నడుం వొరిగిపోయింది. ఎడం చేతిలో తవ్వెడు ముగ్గుపట్టే ముగ్గుబుట్ట (కాయితాల గుజ్జుతో తయారుచేసింది) వుంటుంది. కుడిచేతి వేళ్ళు ముగ్గుతో తెల్లబడిపోయి వుంటాయి. ఆ వేళ్ళతో జుట్టు సర్దుకోడం చేత తల కూడా ముగ్గు బుట్టమల్లే వుంటుంది. ఎవరైనా దగ్గరికి వస్తూంటే ముగ్గు తొక్కుతారేమోనని కోపంగా చూస్తూ వుంటుంది. దూరంగా నిలబడితే ముగ్గు చూశారో లేదోనని దిగాలు పడిపోతూ వుంటుంది.

"ముగ్గు చాలా బాగుంది మాలక్ష్మిగారూ!" అని ఎవరైనా మాట జారారో ఇక ఆ ఉత్సాహంతో ముగ్గుని పెంచుకుంటూ రెండు మూడు ఊళ్ళ వరకూ వెళ్ళిపోతుంది.

వెళ్ళేటప్పుడు 'పాలసముద్రంలో శేషపాన్పు' ముగ్గులచీర కట్టుకుని వుంది. ఇప్పటికి ఆ చీర ఏ సముద్రపు రంగులోకి మారివుంటుందో నేను చెప్ప లేను. చిలకాకు పచ్చ మామిడి తోరణం ముగ్గు అంచున్న జాకెట్టు వేసుకుంది. 'రథం' పని అయ్యాక తల దువ్వుకుంటానని అందాకా జారుముడి వేసు కుంది. "దువ్వెన కూడా తల్లో పెట్టుకుంది" అంటోంది మా చిన్నపిల్ల. దాని మాటలు నమ్మడానికి వీల్లేదు. అది ఇంట్లో వస్తువులన్నీ ఎక్కడో పారేసి అందరి మీదా తొయ్యడానికి చూస్తుంది. ఇంట్లో మాత్రం దువ్వెన కనపడడం లేదుమరి! ఆడపిల్లలిద్దరూ దువ్వెన లేక వేలు ముళ్ళేసుకుని తిరుగుతున్నారు.

ఇంట్లో, మూడు ముగ్గు గొట్టాలే వున్నాయి. నాలు గోది — నక్షత్రాలు పడేది కనబడ్డం లేదు. బహుశా అదికూడా మహలక్ష్మి దగ్గర ముగ్గుబుట్టలో వుండ వొచ్చును.

ఈ లక్షణాలు గల మహలక్ష్మి ఎవరికైనా కనబడితే (ఆవిడ ముడిలో దువ్వెన సంగతి అంతగా పట్టించు కోవద్దు. మా చిన్న పిల్లని గాకపోయినా, ఆ జారు ముడిని కూడా అంతగా నమ్మడానికి వీల్లేదు), ఇంతకీ, ఆవిడ కనబడితే, ముగ్గు తొక్కకుండా పక్కనించి దగ్గరికి వెళ్ళి, ఆవిడ చేతిలో బుట్టనిండా ముగ్గు బదులు ఇచ్చి (బదులే సుమండీ, మళ్ళీ సంక్రాంతి నెలలో తప్పకుండా తీర్చేయగలం.) "మహలక్ష్మిగారూ! వెనకాల ముగ్గు కాస్త చెరిగింది చూడండి" అంటే చాలు. ఆవిడ గిర్రున వెనక్కి తిరుగుతుంది. వెనకాల ముగ్గంతా చెరిగే వుంటుంది కాబట్టి, విసుక్కుంటూ, ఆ ముగ్గంతా సరిచేసుకుంటూ అలా అలా ఇంటికి వచ్చేస్తుంది! మహలక్ష్మిని ఎవరు చూసినా సరే దయ చేసి ఈ సహాయం చేయగలరు. మీ రుణం వుంచు **కోము**. మీ ముగ్గూ వుంచుకోము.

మహలక్ష్మీ! నువ్వు పక్కింటివాళ్ళ వాకిట్లోకి రథం లాగి వొచ్చేస్తానని వెళ్ళావు, 15 రోజుల క్రితం! ఆవిడ కూడా మన వాకిట్లోకి రథం లాగి వచ్చేస్తానని ఇటు వేపు వెళ్ళిందట! 'ఇద్దరూ ఒకవేపన్నా వెళ్ళారుగాదే' అని ఆయనా, నేనూ ఊఁ.... ఇద్దైపోతున్నాం. పోనీ పక్క ఊరు వాళ్ళ వాకిట్లో కన్నా లాగి వొచ్చెయ్య వలసింది లక్ష్మీ! కొంచెం ఎక్కువ దూరమే వెళ్ళినట్టున్నావు.

ఇదివరకు అయితే, అస్తమానూ ఈ ముగ్గుల గోలేవిటని విసుక్కునే వాణ్ణి గానీ, ఇప్పుడు నాకు చాలా పశ్చాత్తాపంగా వుంది. ఇంతకాలం నీ కళని అర్థం చేసుకోలేక పోయినందుకు.

'స్త్రీల అధోగతి' పత్రికవారు సంక్రాంతి సంచికలో — 'ముగ్గులు, స్త్రీల జీవిత సమస్యలన్నిటినీ ఎలా పరిష్కరించగలవో' రుజువు చేస్తూ నువ్వు రాసిన వ్యాసానికి ప్రత్యేక బహుమతి ఇచ్చి ప్రచురించారు. నువ్వు రథం లాగుడు తొందరలో 'అధోగతి' పత్రిక చూసి వుండవని అందులో వివరాలన్నీ నీకు కళ్ళకు కట్టినట్టు రాస్తున్నాను. (ఈ ప్రకటన ఎవరైనా పుణ్యాత్ములు దయతో నీకు చూపిస్తారని నా ఆశ.) ఆ పత్రిక వారు నీ గురించి — అసలు నీలాంటి స్త్రీలే ఆదర్శ స్త్రీలనీ, నీలాంటి ఆదర్శ స్త్రీలకూ, భారత సంస్కృతికీ — 'నాగబంధం' ముగ్గులాగ వొక బంధం చిరకాలంగా పెన వేసుకుపోయి వుందనీ, నిన్ను చాలా గొప్పగా పొగుడుతూ, పాఠకులకు పరిచయం చేసి, నీ వ్యాసం మధ్యపేజీలలో వేశారు.

'స్త్రీలంతా ముగ్గులు పెట్టడం చక్కగా నేర్చుకున్న నాడే, తమ జీవిత సమస్యలన్నీ నేర్పుగా పరిష్కరించు కోగలరు. ఈ ముగ్గుల వల్లనే, అధిక ధరలు కూడా తగ్గించుకోగలరు. ముగ్గుల్లో జ్ఞానం అంతా మన భారతదేశం మాత్రమే ఎరుగును. మనం జన్మజన్మలకీ ఈ సంస్కృతిని కాపాడు కోవాలి' అంటూ వ్యాసంలో ఒక చోట నువ్వు రాసిన వాక్యాల్ని పెద్దపెద్ద అక్షరాలతో ప్రింటు చేశారు.

"ముగ్గుల్లోంచి విప్లవం వొచ్చి తీరుతుంది!" అన్న వాక్యంతో నీ వ్యాసం ముగించడం గొప్ప అభ్యుదయ పూరితంగా వుంది. ఈ వాక్యం దగ్గర నేనూ, మన రామ్మూర్తి గారూ కొట్టుకున్నంత పనిచేశాం. "చచ్చు ముగ్గులూ.... చచ్చు రాతలూనూ" అన్నాడాయన. నాకు వొళ్ళు మండిపోయింది. "ఇందిరాగాంధీ సోష లిజంకన్నా, జయప్రకాశ్ సంపూర్ణ విప్లవంకన్నా మా మహలక్ష్మి 'ముగ్గుల విప్లవం' తీసిపోయిందా?" అన్నాను, పళ్ళు నూరుతూ. ఆయన కిక్కురు మనకుండా లేచి వెళ్ళిపోయాడు. సరేలే. మళ్ళీ 'అధో

గతి' కొద్దాం. ఏం? నీ వ్యాసం మధ్యలో నువ్వు పంపిన 'కాళీయ మర్దనం' ముగ్గు ఆకుపచ్చ రంగుతో ప్రింటు చేశారు. ఎంత చూసినా తనివి తీరడంలేదు. అంత బాగుంది. నువ్వు ఆ డిజైన్ని దుప్పటిమీద కుడతానని, ఎనిమిదేళ్ళ కిందట ప్రారంభించి, రామనీలం దారం అయిపోయిందనీ, మళ్ళీ అలాంటి రకం దొరకలేదనీ, కృష్ణుడి కుడి చెయ్యి పూర్తి చెయ్యకుండానే వుంచేశావు.

ఈ ఎనిమిదేళ్ళనుంచీ ఆ దుప్పటి వాడకుండా దాచేశావుగానీ, మొన్న చంటి వెధవ గాలిపటాలకి ఎక్కడా దారం దొరక్క, కృష్ణుడి కాలు ఒకటి గబగబా వూడదీసి ఆ దారం పట్టుకుపోయాడు.

"అమ్మ తిడుతుందిరా!" అంటే అసలు నా మాట వింటేనా? అవతలి వాళ్ళ గాలిపటాలు కొయ్యడానికి గట్టి సిల్కు దారాలు కావాలిట! ఒకటే గోల!

"పోనీ విప్పితే ఆ కాళీయుణ్ణయినా విప్పండి. కృష్ణుణ్ణి విప్పడం ఏమిటి?" అని ఎంతగోల పెట్టానో!

"ఆ పాముని చూస్తే నాకు భయం వేస్తోంది బాబూ!" అంటూ వాడు కృష్ణుడి కాలు పనే పట్టించాడు.

ఇంతకీ ఆ దుప్పటి తయారైనా, అది మంచం మీద వేస్తే ఆ పాము మీద పడుకోడానికి పిల్లలు జడుస్తారనుకుంటాను లక్ష్మీ! ఆ మాట నేను ఎనిమి దేళ్ళ కిందటే చెప్పినట్టు గుర్తు.

"కృష్ణుడుండగా కాళీయుణ్ణి చూసి భయమేమి టండీ?" అన్నావు. ఇప్పుడు కృష్ణుడు సగం లేనేలేడు.

నీకు కోపం వచ్చే సంగతి వొకటి జరిగింది ఇక్కడ. ఒకావిడ నిన్న మన వాకిట్లోకి రథం లాగి పిల్లల్ని కాసిని మంచినీళ్ళడిగి తాగింది.

"ఎక్కణ్ణించి వస్తున్నారండీ?" అంటే,

"బోధన్ నించి" అంది.

నేను నమ్మలేదు. ఆ ముగ్గుల అందం. ఆ సహనం అదీ చూస్తే, కృష్ణాజిల్లా వ్యవహారంలో కన బడింది.

ఆవిడ నా అనుమానం కనిపెట్టేసి "మాది అసలు తాడేపల్లిగూడెం లెండి. ఈ ప్రాంతం వొచ్చేసి పదేళ్ళు దాటింది. అయినా నేను మన సంప్రదాయాలూ అవీ వదల్లేదు" అని ఎంతో గర్వంగా చెప్పింది. ఆవిడ చెల్లెలు మంగతాయారు అమెరికాలో వుందట. ఆవిడ కూడా మన సంస్కృతీ సంప్రదాయాలూ ఏవీ మర్చి పోలేదట.

నాకు మొదట కొంచెం అర్థంకాక "ఆవిడ కూడా రథం లాగుతూ న్యూయర్క్ వెళ్ళిపోతుందా ఏవిటీ?" అన్నాను.

ఆ పాడు దేశంలో ముగ్గులు వెయ్యనివ్వరుగానీ .... "ఇళ్ళల్లో పూజలూ, పునస్కారాలూ, నోములూ, వ్రతాలూ వుంటాయి చూడండీ — అవన్నీ చేస్తుంది. మన తెలుగువాళ్ళ పిల్లలెవరైనా పెద్ద మనుషులైతే, చక్కగా చిమ్మిలి ఉండలు చేసి కూర్చోబెట్టడం, కడుపులొస్తే గాజులవీ తొడిగించడం, ఒకటేవిటిలెండి, మన సంస్కృతి అంతా బీరుపోకుండా.... అన్నీ పాటి స్తుందిలెండి మా చెల్లెలు. అసలు మా అక్క కూడా సంక్రాంతి నెల్లాళ్ళూ...." అంటూ వాళ్ళ అక్కచెల్లెళ్ళ ముచ్చట్లు చెప్పుకొచ్చింది.

పూర్వం రోజుల్లో అయితే, నేను చాలా వెటకారం చేసి "అవున్లెండి, గజ్జివాళ్ళు ఎక్కడికెళ్తే మాత్రం ఏం లాభం లెండి" అందునుగానీ, ఈసారి ఎంత ముచ్చటే సిందనుకున్నావూ, ఆవిడ మాటలు వింటోంటే!

"వొదినగారు లేరాండీ ఇంట్లో?" అని అడిగింది వెళ్ళబోతూ.

"లేదండీ! రథం ముగ్గు వేసుకుంటూ బెజవాడ వేపు వెళ్ళింది. ఇంకా రాలేదు" అని, సందర్భం వొచ్చింది కదా అని నీ వ్యాసం సంగతి చెప్పాను.

ఆవిడ ఊఁ.... ఇదైపోయి "అయ్యో! ఆవిడ వుంటే చూసేదాన్నే...." అని చాలా బాధపడింది. "సరేలెండి. వచ్చే సంవత్సరం చూస్తాను. ఇంకెంత? 11 నెల్లేగా? మళ్ళీ సంక్రాంతి నెల పట్టనే పట్టేస్తారు" అని సంతృప్తి పడింది.

వొచ్చే సంవత్సరం నువ్వు బెజవాడ వేపు గాకుండా బోధన్‌వేపు వెళ్తే సుభద్రమ్మ గారూ నువ్వూ కలుసుకో వచ్చును.

సుభద్రమ్మగారికి, నీ ఫొటో చూపించాలని చంటి ముండ గోడమీదికి ఎగబాకి, నువ్వు 'గజకర్ణం' ముగ్గు లేస్తూ తీయించుకున్న ఫొటో కాస్తా కింద పడేసింది.

అద్దం పెంకులు తొక్కి అది నా ప్రాణాలుమీద కెక్కడ తెస్తుందోనని, దాన్ని ఎత్తుకుని నిద్రబుచ్చడానికి గంట సేపు పట్టింది.

పాపం సుభద్రమ్మగారికి పిల్లలు గుర్తొచ్చారో ఏమో — "వెళ్తానండీ అన్నయ్యగారూ! పాలు పొయ్యి మీదపెట్టి వొచ్చేశాను, పిల్లసన్నాసు లేంచేస్తున్నారో!" అంటూ వెళ్ళిపోయింది.

నువ్వు ఇంటికి రాగానే చిన్న ముండనేవీ అనకు, ఫోటో గురించి. అద్దం మళ్ళీ కట్టించుకో వచ్చులే.

అసలు సంగతి మర్చేపోయాను. రాంబాయమ్మ గారికి మనం 2 బస్తాల ముగ్గు బదులు తీర్చాలని కబురు పంపించారు. ఒకసారెప్పుడో నువ్వు 3 బస్తా లివ్వాలని చెప్పినట్టు గుర్తు. మళ్ళీ ఆవిడకి ఆ మూడో బస్తా సంగతి గుర్తొస్తుందేమోనని, ఆ రోజే ముగ్గుబండి వొస్తే, మొత్తంగా బేరమాడి, సీతారావమ్మగారికి 4 కుంచాలూ, లక్ష్మీ కాంతమ్మగారికి మన అన్నం గిన్నెతో 7 గిన్నెలూ, తీర్చేశాను. ఇంకా 2 బస్తాలుంటే ఈ ఏడా దంతా సరిపోతుందిలే అని అటకమీద వేయించాను. అన్నట్టు ఏలూరునించి రథంలాగుతూ ఇక్కడికి వచ్చి ముగ్గు అయిపోయి బాధపడుతోంటే, వొకావిడకి వొకకుంచెడు ముగ్గు పాత సంచీలో పోసి వూరికే ఇచ్చాను. ఆవిడ పేరు సక్కుబాయి గారట. నువ్వూ అలాగే ముగ్గు అయిపోయి ఎక్కడేం ఇబ్బందులు పడుతున్నావో గదా అని నా మనసంతా ఊఁ.... ఇదై పోతోంది.

పాపం ముగ్గు ఇవ్వగానే సక్కుబాయి గారు మొహవంతా 'విష్ణుచక్రం' ముగ్గంత చేసుకుని "చచ్చి నీ కడుపున పుడతాను" అంటూ ఒకటే ఇదై పోయింది. అంటే నీ కడుపునే కదా? ఆడపిల్లలు కూడా నీమాట వినకుండా ముగ్గులు తొక్కినప్పుడల్లా — "వీళ్ళకి నా ఆనవాయితీ అబ్బదనుకుంటాను" అంటూ కళ్ళ నీళ్ళు పెట్టుకుంటూ వుంటావు. నిజంగా సక్కుబాయిగారే నీ కడుపున పుడితేనా? — అని నాకూ నిజంగా ముచ్చ టేసింది.

పిల్లలతో కొంచెం ఆగడంగానే వుంది.

సంక్రాంతి నెల పట్టినప్పటినించీ ఈ నెల్లాళ్ళూ వాకిట్లోనూ, గదుల్లోనూ, ముగ్గులు తొక్కకుండా మూలమూలల్నించీ గోడవారల్నించీ తిరిగే వాళ్ళా? ఇప్పుడు వాళ్ళ గంతులు చూడాలి! నువ్వు స్నానాల గదిలో పంపు కిందవేసింది 15 చుక్కల ముగ్గా, 17 చుక్కల ముగ్గా?

"బాత్ రూం తడపకండి! ముగ్గు చెరుగుతుంది. పండగన్నా పూర్తిగా వెళ్ళలేదు!" అని ఎంత చెప్పినా, నా మాట చెవిన బెడితేనా? నువ్వెళ్ళిన్నాడే అక్కడ స్నానాలు ప్రారంభించి ఒక్క గీతన్నా మిగలకుండా మాయం చేసేశారు. మళ్ళీ నువ్వంటే ఎంత ప్రేమను కున్నావూ వీళ్ళకి! "అమ్మకి చప్పున ఒక బస్తా ముగ్గు పంపించెయ్యి నాన్నా!" అని రోజా గొడవే. పిల్లల కోసం బెంగపెట్టుకోకు! వాళ్ళు నిక్షేపంలా ఆడు కుంటున్నారు.

నువ్వు పొయ్యి దగ్గర 'జంట సర్పాల' ముగ్గు వేశావు. మొదట్లో వాటిని చూస్తే కాస్త భయం వేసింది. నువ్వెళ్ళిన్నాడే పాలు పొంగి ఆ సర్పాలు రెండూ తూములోకి కొట్టుకుపోయాయి.

ఇప్పుడు పెద్దవాడు కృష్ణుడి రెండో కాలు వూడదీస్తున్నాడు. వాడికి కొత్త గాలిపటం దొరికిందట. "ఒరే! తప్పురా నాయనా, కృష్ణుణ్ణి వూడదియ్యటం ఏవిట్రా?" అని బతిమాలాను.

"తప్పేం లేదులే నాన్నా! నీకేం తెలీదు. కృష్ణుడు ద్రౌపదికి పొడుగ్గా వుండే చీరలివ్వలేదా ఏంటి? మా గాలి పటాలకి దారాలిస్తే ఏం? అసలు కృష్ణుడు అడిగితే చూద్దాంలే" అంటూ హడావుడిగా వెళ్ళి పోయాడు.

మహాలక్ష్మీ! ఇక నువ్వు రాకపోతే కృష్ణుడు మనకి దక్కడు. అతన్ని మొత్తంగా గాలిపటాలకి వేలాడ దీసేస్తారు.

నా మాట విని ఇక వొచ్చెయ్యి! సంక్రాంతి వెళ్ళి పోయి 15 రోజులైపోయింది. రేపో మాపో సంక్రాంతి మళ్ళీ రానే వొస్తుంది. ఇంకెంత? సుభద్రమ్మ గార న్నట్టు 11 నెల్లేగా?

నీకోసం ఎదురుచూస్తూ నీ భర్త
దగ్గుల లక్షింపతి
శంకరమఠం, హైదరాబాదు.

[14-2-1975 "ఆంధ్రజ్యోతి" వారపత్రికలో] ★